# సింగిల్ పేజీ కథలు

**కంప్యూటర్, ఈమెయిల్ లోకంలో ఏదీ దూరం కాదు. అలాగే సెల్‌ఫోన్ వాళ్ళకి 'దూరం వాళ్ళు దగ్గర, ఎదుటివారు దూరం' అంటే అతిశయోక్తి కాదేమో!**

కంప్యూటర్ ప్రపంచం- ఈమెయిల్స్, ఇంటర్‌నెట్ ఎంతో దూరంలో వున్న మనుష్యుల్ని భలే బాగా కలుపుతోంది. ఇంట్లో వుత్తినే పడుంది మా పి.సి. నిజం చెప్పాలంటే దానివల్ల పైసా ఆదాయం లేదు. ఏమిటో పిచ్చి, అంతా కంప్యూటర్స్ కారుచవకయ్యాయని అనేసరికి బ్యాంక్ లోన్ తీసుకుని మరీ కొన్నాం. ముఖ్యంగా అబ్బాయి అమెరికా వెళ్ళాడు. వాడిని హాయిగా ఇంట్లోనే కూర్చుని చూస్కోవచ్చు. ముఖాముఖి మాట్లాడుకోవచ్చు-ఛాటింగ్ ద్వారా అన్న ఆశతో కొనేశాం. తీరా కొన్నాక, మా కాలనీలో నెట్ కనక్షన్ ఓ పట్టాన దొరకలేదు. అది కనెక్ట్ అయ్యి మహా అయితే ఓ నెలరోజులు మాట్లాడుకున్నాం, సరదాగా. అమెరికాలో పగలు, మనకి రాత్రి కాబట్టి ఆ టైం సరిచూసుకుని బానే వుందనుకున్నాను. క్రమంగా మా పి.సి. ఇంట్లో మరో మనిషిలా అలవాటైపోయింది. కనీసం ఒక గంట కంప్యూటర్‌తో గడపటం- గేమ్స్, ఇన్ఫర్‌మేషన్ డౌన్‌లోడ్ అన్నింటికీ అదే దిక్కు.

మా కజిన్ సత్య చెప్పాడు. "అక్కా! ఇదో మంత్రాల పెట్టె- ఏ ప్రశ్న వేసినా సాధారణంగా లేదనకుండా జవాబు చూపిస్తుంద"ని. ఆశ్చర్యం. ఇంతింత విషయాన్ని ఎవరు ఓపిగ్గా టైప్ చేసి, అందులో దాచారా? అనుకునేదాన్ని. వాళ్ళకుపయోగం ఏమిటో అంతు పట్టేది కాదు.

రైల్వే రిజర్వేషన్, సినిమాల గురించి, వార్తాపత్రికలు, కథలు, గాసిప్స్, టూర్ ఇన్ఫర్‌మేషన్, వంటలు, ఫ్యాషన్స్, పాటలు, పాటల్లో మాటలు, జీవిత చరిత్రలు, ఏ దేశచరిత్ర అయినా తెల్సుకోవచ్చు.

ఆమధ్య మా అన్నయ్య కూతురు 'భావయామి రఘురామం' మహానుభావురాలు ఎమ్.ఎస్.గారి పాటకి కొరియోగ్రఫీ, డాన్స్ కంపోజ్ చేసుకోవాలని, ప్రతి పదానికి అర్థం, తాత్పర్యం కావాలని, ఎవరైనా సంస్కృత పండితులు దగ్గరకెళ్ళాలని అంది. సరే చూద్దాం కదాని, కంప్యూటర్లో 'భావయామి సమ్మరి' అని గూగుల్‌లో అడిగానంతే. ఆశ్చర్యంగా ఎన్నో సైట్స్ వచ్చాయి. అందులో పద పదానికి చక్కగా అర్థం, భాష్యంతో-సంస్కృత పదాలకి ఇంగ్లీష్‌లో చక్కగా వుంది. ఎంత సంతోషమనిపించిందో. ఎంతో శ్రమ టైం కల్సివచ్చింది.

యువతకి మహా ఇష్టమైంది, టైంపాస్ ఛాటింగ్. అందులో ఏదీ నిజముండదడు. అంతా బూటకమే. నీ పేరు నీ ఊరు, నీ వయసు..ఒకటేమిటి? అన్నీ మారు పేర్లే. ఈ ఛాటింగ్ అన్నది కొత్తవాళ్ళతో స్నేహాలకి, ప్రపంచంలో ఎవరితోనైనా స్నేహం చేసే అవకాశం కల్పిస్తుంది. కానీ ఇది నిషాలాగా ఎడిక్ట్ అయ్యే ఛాన్సుంది. అలా అని మొత్తం 'వృథా' అనలేం. దీని ద్వారా వ్యాపారాలు చేస్తున్నారు. ఖండాంతర స్నేహాలు పెంపొందుతున్నాయి. అనుబంధాలు, ప్రేమలు, ఈమధ్యకాలంలో పెళ్ళిళ్ళు కూడా జరుగుతున్నాయి. చెప్పులరిగేలా సంబంధాల కోసం తిరిగే రోజులు పోయాయి. మేరేజ్ బ్యూరోలలో

## చాట్ భారతం

రిజిస్టర్ చేసుక్కుని తమకులం వారిని, తమకిష్టానుసారంగా వెతుక్కుని, కలుసుకునే వీలు కలిగిస్తుంది.

ఈ ఛాటింగ్‌లో ఎన్ని రకాలో? ఏదో ఆషామాషీగా మాట్లాడ్డం..అదీ ఫలానా భాష వారితో ఏ విషయం? వంటలా? బిజినెస్? నమ్మకాలు, మతమా? ఆటలా? ఇలా బోలెడన్ని విషయాలు మళ్ళీ అందులో సబ్ డివిజన్స్- అన్ని విషయాలూ చక్కగా క్రోడీకరించి వున్నాయి. వయసుకి తగ్గట్టు, మనకే విషయం ఇష్టమో, ఆ 'ఫలానా' రూమ్‌లోకి వెళ్ళవచ్చు. నిజానికి ఏ రూమ్‌లోకెళ్ళినా, మనిషి బాహాటంగా మాట్లాడేవి 'బూతులే' అని కనిపెట్టాను.

నేనోసారి ఎరక్కపోయి 'మతము నమ్మకాలు' అనే రూమ్‌లోకెళ్ళాను. మళ్ళీ అందులో-క్రిస్టియానిటీ, ఇస్లామ్, బుద్ధిజం, హిందూయిజం, ఇలా అన్నీ వుంటాయి. అందులో హిందూయిజంని సెలక్ట్ చేస్కున్నాను. పెద్ద సైజు అక్షరాలతో శ్రీరాముడిని, సీతాదేవిని కలిపి బండబూతులు తిడుతున్నాడెవరో-ఎవరో మతిభ్రష్టులు. వరసపెట్టి అదే పనిగా తిడుతున్నాడు. "ముందీ ఛండాలం ఆపండి!" అని టైప్ చేశాను ఎర్ర అక్షరాలతో. ఆశ్చర్యం- కాసేపు అన్నీ ఆగాయి "ముందు మనుష్యుల్లాగా మాట్లాడుకున్నాక, దేవుళ్ళ విషయం చూద్దాం- ఈ స్థలాన్ని మలినం చెయ్యొద్దని" అన్నా. కొందరు నన్ను సమర్థించారు.

మరోసారి ఎగుమతి-దిగుమతుల వివరాలెలా వుంటాయోనని 'బిజినెస్' రూమ్‌లోకి వెళ్ళాను. అక్కడ ఏ ముహూర్తంలో తగిలాడో గానీ, ఒకడు రాహుల్ నన్ను రోజుకొక్కసారైనా పలకరించి, ప్రేమ కురిపిస్తున్నాడు. "రాహుల్..నీకూ-నాకు వయసు చాలా తేడా వుందిరా బాబు" అన్నాను. పెళ్ళయి, పిల్లలు, సంసారం అన్నీ సజావుగా వున్నాయని చెప్పాను. అవేం పట్టించుకోలేదు. నన్ను చూడకుండానే 'తెగ' పొగడ్తలు..హిందీలో పొయిరీలు, లవ్‌లెటర్స్ పంపించాడు. కోపంతో ఛడామడా తిట్టాను. "నాకు నీ దగ్గర్నించి ఏ ఆశా లేదు. కేవలం నీతో నేను మాట్లాడాలి. అంతేచాలు" అంటూ 'వన్‌సైడ్ లౌ' లాంటిది మొదలెట్టాడు. ఎక్కడో నా మనసులో అతని మీద సాఫ్ట్‌కార్నర్ ఏర్పడుతోంది. అతను ప్రేమగా మాట్లాడే పద్ధతి, 'నువ్వే నా ప్రాణం' అన్నట్టు చూపించే కన్సర్న్, చాలా నచ్చేది. సంసార జీవితం యాంత్రికంగా, డ్యూటీగా, ఎండి మోడైపోతున్న ఈ సమయంలో నవ వసంతంలా, ఒక తాజా తెమ్మెరలా హాయిగా సోకింది మనసుకి. బుద్ధి ఎంత మందలించినా మనసు వినేది కాదు. నాలో వున్న 'ఎవరిచేతైనా ఆరాధింపబడాలనే' ఆశ తీరి ఆనందంగా వుంది. నన్నింతవరకూ అతను చూడలేదు. ఎడ్రస్ చెప్పలేదు. ఊరుతప్ప ఏమీ తెలీదు. "నిన్నీ జన్మలో నెట్‌లో తప్ప కలవనని, చూడనని" మాటిచ్చాడు. మంచి నేస్తం అయ్యాడు. నా విషయాలు, సమస్యలు, ఉద్దేశ్యాలు, పిల్లల ప్రవర్తనలు, అన్నీ ఒక ఆప్తుడికి చెప్పుకున్నట్టు చెప్పుకుని రిలీఫ్‌గా వుండేదాన్ని. రాహుల్ తన వ్యాపారాలు, స్టాఫ్‌తో గొడవలు, ఆడపిల్లలు బరితెగించిన వేషాలు..ఇలా అన్నీ పూసగుచ్చి చెప్పేవాడు. విచిత్రమైన అనుబంధం పెరుగుతోంది. ఇది తెలిసినప్పటినుంచి మావారి వైఖరి మారుతోంది. పూర్వంలా, 'పట్టించుకోనితనం' తగ్గింది. నిర్లక్ష్యం పోయి, మా బంధానికి ప్రాణం రాసాగింది. పోటీ వుంటే, బంధాలకి కూడా విలువ పెరుగుతుందా? అనిపించింది మధ్యమధ్యలో "ఏమంటున్నాడు మీ మిత్రుడు?" అంటూ ఆరాలు.

"ఏముంది? నన్ను చూడకుండానే గుడ్డిగా ఆరాధిస్తున్నాడు. నా మనసెంతో నిర్మలంగా, అందంగా వుందిట. గ్రీన్ షిఫాన్ చీర నీకు నప్పుతుందనుకుంటానని ఊహిస్తున్నాట్ట" అన్నా. మావారు సీరియస్‌గా "ఊ" అన్నారు. తమాషా!

నాలుగు రోజుల్లో గ్రీన్ షిఫాన్ చీర నాకు బహుమతిగా తెచ్చారు. సందర్భమేమీ లేదు. ఆశ్చర్యమేసింది. "పద సినిమాకెళ్ళి, బైట తిని వద్దామా? త్వరగా తయారౌ. ఊర్కే ఎప్పుడూ కంప్యూటర్ ముందు పడుండకు టైం వేస్ట్ చేస్తూ" అన్నారు.

నాకేమిటో వింతగా వుంది. ఏనాడూ ప్రత్యేకం నీకు అంటూ ఏమీ తేవాలని తోచని మనిషి ఇదేమిటి? అన్పించింది. ఈ మార్పు ఊహించనిదైనా మళ్ళీ వసంతం తెచ్చింది. మరి నేను కంప్యూటర్‌ని మెచ్చుకోక ఏం చేస్తా చెప్పండి?

**-ఎన్.సి.విజయఫణి (సికింద్రాబాద్)**